క్లుప్తంగా

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



సరస్వతిదేవి అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని సరస్వతిదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

కంది పంట దగ్ధం

బేస్తవారిపేట: మండలంలోని పాపాయిపల్లె సమీపంలోని పొలంలో కంది పంట దగ్ధమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఓ రైతు కంది పంట నూర్పిడి చేసుకున్న తర్వాత వ్యర్థాలకు నిప్పుపెట్టారు. ఆ మంటలు శ్రీరామ్ మణికుమార్ అనే రైతు పొలంలో కోతకోసి పెట్టుకున్న కంది కుప్పలకు వ్యాపించాయి. 70 సెంట్ల పొలంలోని పంట బుగ్గిపాలైందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. కంభం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో చుట్టు పక్కల పొలాల రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో బస్ షెల్టర్ ఆవరణలో ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. సేవా సమితి అధ్యక్షుడు అనంతరామయ్య మాట్లాడుతూ.. భగవాన్ సత్యసాయి చూపిన మార్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కూలింగ్ మినరల్ వాటర్ వాటర్ చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

హిందువులు ఐకమత్యంగా ఉండాలి



సమావేశంలో పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు

గిద్దలూరు రూరల్: హిందువులు ఐకమత్యంగా ఉండాలని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యకారిణి సభ్యులు పానుగంటి శ్రీనివాసులు పేర్కొన్నారు. గిద్దలూరు ఖండ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలోని కాశినాయన ఆలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మాన్ని సంరక్షించేందుకు హిందువులు ఐక్యమత్యంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో జి.రంగస్వామిరెడ్డి, పంటా మల్లారెడ్డి, ఆనంద్, సూరే క్రిష్టారావు, ఆసులాల్, కుమార్, బీజేపీ నాయకులు అప్పిసెట్టి ఉదయ్‌శంకర్, పిడతల రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

పుల్లలచెరువు: మత సామరస్యానికే ప్రతీక రంజాన్ అని యర్రగొండపాలెం శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం చాపలమడుగు సర్పంచ్ టి.సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పుల్లలచెరువు జామియా మసీదులో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక నమాజు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొని ఉపవాసం ఉన్న ముస్లింలకు వడ్డించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నాయకులు కోటిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, రఘు, ఉమామహేశ్వరరెడ్డి, బి.సుబ్బారెడ్డి, గాలిరెడ్డి, జబీబుల్లా, ఎల్.రాములు, రవణారెడ్డి, వీరారెడ్డి, దినేష్‌యాదవ్, యూసఫ్ ఖాన్, ఖాదర్, సుందరరావు, కాశయ్య, హనుమంతరావు, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దతు కరువై.. రైతు గుండె బరువై..!

- నేటికీ ప్రారంభం కాని శనగ, కంది కొనుగోలు కేంద్రాలు
- గత ఏడాది కంటే తక్కువగా ప్రభుత్వ మద్దతు ధర
- అంతకంటే తక్కువ ధరకు అడుగుతున్న దళారులు
- నానాటికీ పతనమవుతున్న ధరలు
- పెట్టుబడి కూడా చేతికొచ్చేలా లేదని రైతుల ఆవేదన



కోల్డ్‌స్టోరేజీలో నిల్వ చేసేందుకు తీసుకొచ్చిన శనగలు



బేస్తవారిపేటలోని కోల్డ్ స్టోరేజీలో శనగలు అన్‌లోడ్ చేస్తున్న రైతులు

బేస్తవారిపేట:

ప్రకృతి వైపరీత్యాలు వెంటాడినా.. తెగుళ్లు చుట్టుముట్టినా పంటలు కాపాడుకునేందుకు నానా ప్రయత్నాలు చేసిన రైతులకు సర్కారు మద్దతు కరువైంది. శనగ, కంది కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం నేటికీ ఏర్పాటు చేయలేదు. గిద్దలూరు డివిజన్‌లో కంది 4,225 హెక్టార్లు, శనగ 6,116 హెక్టార్లలో సాగు చేశారు. శనగ, కంది పంటలను అమ్ముకునేందుకు రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం క్వింటా శనగలు మద్దతు ధర రూ.5,650 ఇస్తున్నట్లు ప్రకటించింది. అయితే ఇందులో సవాలక్ష నిబంధనలతో కొర్రీలు పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో బయట మార్కెట్‌లో దళారులకే రైతులు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు రైతులు దళారులు తక్కువ రేటుకు అడుగుతుండటంతో కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసుకుంటున్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఒక రైతు కూడా శనగ పంట అమ్మకానికి రిజిస్ట్రేషన్ చేయించుకునే పరిస్థితి లేదు.

కందులను సొసైటీల ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించగా రైతుల నుంచి కందుల శాంపిల్లు సేకరిస్తున్నారు. ఈ ఏడాది సాగు చేసిన కంది పంటకు సంబంధించి పూత, పిందె దశలో వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో దిగుబడిపై దెబ్బపడింది. దీంతో కందుల్లో నల్లగింజ రావడంతోపాటు దిగుబడి తగ్గింది. మిషన్లతో నూర్పిళ్లు చేయడంతో నాణ్యతలో తేడా వచ్చింది. ప్రభుత్వం క్వింటా కందులకు మద్దతు ధర రూ.7,550 ప్రకటించగా కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరిగిన రైతులకు ఏదోఒక సాకు చెప్పి కొర్రీలు వేస్తుండటంతో దళారులకు అమ్మేయాల్సిన పరిస్థితులు దాపురించాయి.

నిరాశాజనకంగా ధరలు

శనగ సాగుకు ఏటా పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. ఆ మేరకు ధరలు మాత్రం లభించడంలేదు. ఒక ఎకరా శనగ సాగు చేసేందుకు కనీసం రూ.20 వేల నుంచి రూ.25 వేలు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. అయితే ధర ప్రస్తుతం క్వింటా రూ.5 వేలు పలుకుతోంది. గత డిసెంబర్‌లో కురిసిన వర్షాలకు ఎక్కువ శాతం పొలాల్లో నీరు నిలిచి పంట కుళ్లి పనికిరాకుండా పోవడంతో దిగుబడి పడిపోయింది. తుఫాన్ ప్రభావంతో దిగుబడి 3-4 క్వింటాళ్లకే పరిమితం కావడంతో పెట్టిన పెట్టుబడి కూడా చేతికొచ్చేలా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వంచనకే ప్రభుత్వం పరిమితం

వాతావరణ పరిస్థితులు అనుకూలించక రైతులు నష్టాల పాలవుతున్నా ప్రభుత్వం ఏ మాత్రం కనికరించడంలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో ఏటా రూ.13 వేలను అందజేసింది. ప్రకృతి విపత్తుల సమయంలో రైతులను ఆదుకునేందుకు పైసా వసూలు చేయకుండానే ఉచిత పంటల బీమాను అమలు చేసేవారు. ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే అదే సీజన్‌లో రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకున్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తోంది. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేలు ఇస్తామని ప్రకటించినా నేటికీ అమలు చేసిన పాపాన పోలేదు.

ఎన్నికల హామీలు నిలబెట్టుకోవాలి



ప్రజా చైతన్య యాత్రలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

- ప్రజా చైతన్య అధ్యయన యాత్రలో సీపీఎం నేతలు

బేస్తవారిపేట: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డి.సోమయ్య డిమాండ్ చేశారురు. ఆదివారం స్థానిక బస్టాండ్ ఆవరణలో సీపీఎం ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమంలో మాట్లాడారు. మార్కాపురం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం నిలిపివేయడమే కాకుండా, 2024-25లో మొదటి దఫా అడ్మిషన్లు జరగాల్సిన పరిస్థితిలో సిబ్బందిని బదిలీ చేయడం తగదన్నారు. మెడికల్ కళాశాలను పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం వల్ల పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యం దూరమవుతుందన్నారు. మార్కాపురాన్ని జిల్లా చేసిన తర్వాతే ఈ ప్రాంతంలో అడుగుపెడతానని ఎన్నికల సమయంలో చెప్పిన చంద్రబాబు.. 9 నెలల కాలంలో మూడు సార్లు జిల్లాలో పర్యటించినా హామీ నెరవేర్చడంపై దృష్టి పెట్టలేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు డీకేఎం రఫీ, రూబేన్, ఆవులయ్య, బేస్తవారిపేట మండల నాయకులు జీ అబ్రహాం, అమృతరాజు, డి.తిరుపతయ్య పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టును వినియోగంలోకి తేవాలి

గిద్దలూరు రూరల్: సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం గిద్దలూరు పట్టణంలోని పలు వీధుల్లో ప్రజా చైతన్య అధ్యయన యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సోమయ్య మాట్లాడుతూ.. వెలిగొండ ప్రాజెక్టు మిగులు పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని, మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించాలని, మార్కాపురంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీని ప్రైవేట్‌కు అప్పగించకుండా ప్రభుత్వ రంగంలోనే పూర్తి చేయాలని కోరారు. మార్కాపురం రెవెన్యూ డివిజన్‌లోని ప్రజలు పూర్తిగా వెనుకబడి ఉన్నారన్నారు. పశ్చిమ ప్రకాశాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజల సమస్యలపై ఈ నెల 20వ తేదీన మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ హాజరై ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు టి.ఆవులయ్య, రఫీ, చెన్నయ్య, థామస్, సింగరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి

- డీపీవో వెంకటనాయుడు



ఉప్పలపాడులో ఇంటి పన్ను చెల్లించిన వారికి రశీసు ఇస్తున్న డీపీవో

పొదిలి రూరల్: గ్రామాల్లో ఇంటి పన్ను బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) జి.వెంకట నాయుడు అధికారులను ఆదేశించారు. ఆదివారం పొదిలి మండలంలోని ఉప్పలపాడు పంచాయతీలో పన్నుల వసూలును పరిశీలించారు. డీపీవో మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఇంటి పన్నుతోపాటు, నీటి పన్ను బకాయిలను పూర్తి స్థాయిలో వసూలు చేయాలన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో లక్ష్యం సాధించేందుకు సిబ్బంది కృషి చేయాలని చెప్పారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలపై దృష్టిసారించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శేషగిరి ఉన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలి

- పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి



కంభంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి



కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

కంభం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి సూచించారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఆదివారం ఆయన పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. తరగతి గదులు, బెంచ్‌లు, మంచినీటి సౌకర్యం, ఇతర వసతులపై ఆరా తీశారు. ఆర్జేడీ మాట్లాడుతూ.. కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను నిబంధనల మేరకు అందుబాటులో ఉంచాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో అన్ని కేంద్రాల వద మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని సూచించారు.

సమస్యాత్మక కేంద్రంగా కొమరోలు హైస్కూల్

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల టెన్త్ పరీక్ష కేంద్రాన్ని సమస్యాత్మకమైనదిగా అధికారులు ప్రకటించారు. జిల్లాలో 6 సమస్యాత్మకమైన కేంద్రాలను ప్రకటించగా అందులో కొమరోలు హైస్కూల్ ఒకటి. పరీక్ష నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీసీ కెమెరాల పర్యవేక్షణలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ వెంకటరత్నం తెలిపారు. కాగా మండలంలో 450 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరవుతున్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రాచర్ల: రాచర్ల మండలంలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవోలు వారణాసి గిరిధర్‌శర్మ, శివకోటేశ్వరరావు ఆదివారం తెలిపారు. మండలంలోని ఆకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాచర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మోడల్ స్కూల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మూడు పరీక్ష కేంద్రాల్లో 423 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఉదయం 8:30 గంటలకే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకుని హాల్ టికెట్ నంబర్ సరిచూసుకుని తమకు కేటాయించిన గదుల్లో కూర్చోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, అత్యవసర మందులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసిన పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5:30 వరకు తరగులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు, పెదారికట్ల, మర్రిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, వెలుగొండ గురుకుల పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ ఎస్‌కె డాంగేషరీఫ్ తెలిపారు. గొట్లగట్టు పరీక్షా కేంద్రంలో గొట్లగట్టు జడ్పీ, కేజీబీవీ విద్యార్థులు 210 మంది పరీక్ష, పెదారికట్లలో 130 మంది, మర్రిపాలెంలో 120 మంది, వెలుగొండ గురుకుల పాఠశాలలో 170 మంది పరీక్షలు రాస్తున్నారని వివరించారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన వసుతులు కల్పించినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

కూటమి నేతల పెత్తనం.. భక్తులకు సంకటం



ఆలయంలో కూటమి నాయకుని హడావుడి



ఏర్పాట్లను పర్యవేక్షించలేక చేతులెత్తేసిన ఆలయ సిబ్బంది

- అల్లూరి పోలేరమ్మ ఆలయ కమిటీ ఏర్పాటు కాకుండానే ఆధిపత్య ధోరణి
- కూటమి నాయకులు, సానుభూతిపరులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు
- ప్రేక్షక పాత్ర వహించిన పట్టణ పోలీసులు
- గంటల కొద్దీ క్యూలైన్‌లో వేచి ఉన్న వృద్ధులు, మహిళలు

మార్కాపురం టౌన్: ఆధ్యాత్మికతకు నెలవైన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం కూటమి నాయకులు చేసిన హడావుడి తీవ్ర చర్చనీయాంశమైంది. దేవస్థానం కమిటీ అధికారికంగా ఏర్పాటుకాక ముందే కాబోయే కమిటీ సభ్యులం మేమేనంటూ ఆధిపత్య ధోరణి ప్రదర్శించారు. పట్టణ పోలీసులు సైతం ప్రేక్షకపాత్ర వహించడంతో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్నడూ లేని విధంగా ఆలయంలో రాజకీయ పెత్తనమేమిటని మండిపడుతున్నారు. ఆలయ కమిటీకి ప్రభుత్వం ఆమోదం తెలిపాక, ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆలయ సభ్యులుగా వ్యవహరించడం ఆనవాయితీ. అయితే అల్లూరి పోలేరమ్మ దేవస్థానంలో మాత్రం కొందరు కూటమి నాయకులు తామే కమిటీ సభ్యులమంటూ పెత్తనం చేశారు. వారి అనుచర గణానికి, టీడీపీ సానుభూతిపరులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ పరిణామంతో మార్కాపురంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వచ్చిన భక్తులు ఇబ్బందులు ఎదుర్కోక తప్పలేదు. ఈ విషయంలో పట్టణ పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తూ కూటమి నాయకులకు అనుకూలంగా వ్యవహరించడం భక్తులను ఆసహనానికి గురిచేసింది. ఇదిలా ఉంటే ఆలయంపై అజమాయిషీ ఉన్న సిబ్బంది కూడా ఏమి చేయాలో పాలుపోక వారికి అనుకూలంగా ప్రవర్తించడం భక్తులను మరింత విస్మయానికి గురిచేసింది. గతంలో కూడా ఆలయ కమిటీ సభ్యులుగా ఎంతోమంది వ్యవహరించారు కానీ ఇలా ఎప్పుడూ ప్రవర్తించలేదని భక్తులంతా చర్చించుకున్నారు.

క్యూలైన్‌లో గంటలకొద్దీ పడిగాపులు

పోలేరమ్మ తల్లి దర్శనం కోసం 10 రూపాయలు, 50 రూపాయల ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. టిక్కెట్లు తీసుకుని అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లోకి ప్రవేశించిన భక్తులకు కూటమి నాయకులు తమ చర్యలతో చుక్కలు చూపించారు. స్పెషల్ దర్శనం పేరుతో కూటమి నాయకులు, టీడీపీ సానుభూతిపరులను అడ్డగోలుగా అనుమతించడంతో చిన్నపిల్లలు, పెద్దలు, వృద్ధులు గంటల కొద్దీ క్యూలైన్‌లో వేచి ఉండలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయకుండా వారిని కూడా గంటల కొద్దీ క్యూలైన్‌లో వేచి ఉండేలా చేయడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

అల్లూరి పోలేరమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు



నాగశిలలకు పూజలు చేస్తున్న మహిళలు

మార్కాపురం టౌన్: ఉగాది ఉత్సవాల సందర్భంగా మార్కాపురం పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ దేవస్థానం భక్తులతో కిక్కిరిసింది. మూడో ఆదివారం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్ శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని పుట్టకు, నాగశిలలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు. అలాగే ఎస్వీకేపీ కళాశాల రోడ్డులోని పోలేరమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.

ఘనంగా పొట్టిశ్రీరాములు జయంతి

- ఘనంగా అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి



మార్కాపురం : పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ కృష్ణ తదితరులు



మార్కాపురం : పొట్టి శ్రీరాములు, గాంధీ విగ్రహాలకు వాసవీ క్లబ్ సభ్యుల నివాళి



కొమరోలులో పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

మార్కాపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు త్యజించిన గొప్ప వ్యక్తి పొట్టిశ్రీరాములు అని మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీ కృష్ణ కొనియాడారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

☛ వాసవీ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు నివాళులర్పించారు. ప్రెసిడెంట్ ఎల్. పూర్ణచంద్రరావు, సెక్రటరీ ఎం.కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో ఐతబీ దేసు వెంకట ప్రసాదరావు, గంగిశెట్టి కిరణ్‌కుమార్, పోలేపల్లి లక్ష్మినారాయణ, సూరే కేశవరావు, సీహెచ్ శివకుమార్, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెలుగూరి వెంకటేశ్వర్లు, ఆటపా సభ్యులు పాల్గొన్నారు.

కొమరోలు: అమరజీవి పొట్టిశ్రీరాములు ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు తుమ్మలపెంట రామనారాయణ సూచించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పొట్టిశ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు భవనాశి నారాయణస్వామి, బొగ్గరపు శ్రీనివాసులు, బొగ్గరపు నారాయణస్వామి, నరసింహారావు, ఏడుకొండలు పాల్గొన్నారు.